# సిగ్గుబిళ్ళ

"అక్కా! నా పరీక్ష ఫీజు కట్టడానికివాళే లాస్టడే కదా మరేమో నాన్నగారు ఊర్నించి ఇంకా రాలేదు ఎలాగ?" అన్నాడు విచారవదనంతో రవి.

"వచ్చేస్తార్రా! నువ్వేం దిగులుపడకు. నీ పరీక్ష ఫీజుకేం ఫర్వాలేదు. కట్టేద్దాం" అంటూ సోదరుడికి ధైర్యం చెప్పింది నాగరత్నం.

రవికి పధ్నాలుగు ఏళ్ళు. టెన్త్ చదువుతున్నాడు. చాలా చురుకైనవాడు. బుద్ధిమంతుడు. నాగరత్నం వయసు పదహారు సంవత్సరాలు. ఇంటర్ సెకండియర్ చదువుతోంది. తెలివైన పిల్ల. టెన్త్‌క్లాస్ స్కూలు ఫస్ట్ వచ్చింది. వారు వామనరావు, అనంతలక్ష్మి దంపతుల పిల్లలు. వామనరావు కలెక్టర్ ఆఫీసులో స్టెనోగా పనిచేస్తున్నాడు.

అనంతలక్ష్మి తమ్ముడు రామశర్మ నందివాడలో వుంటున్నాడు. అతను ఆ ఊళ్లో ఎలిమెంటరీ స్కూల్లో టీచరు. అతనికి ఆ ఊళ్లో కొద్దిగా పొలం వుంది. రామశర్మ తన తల్లి కాంతమ్మగారికి చాలా సీరియస్‌గా వుంది వెంటనే రమ్మనమని వామనరావుకి శుక్రవారం రాత్రి మనిషి ద్వారా కబురుపంపేడు.

శనివారం ఉదయాన్నే వామనరావు భార్యను తీసుకొని నందివాడ బయల్దేరేడు. ఆదివారం ఉదయం కాని లేకుంటే సాయంత్రానికల్లా వచ్చేస్తామని పిల్లల్ని యింటిదగ్గరే వుంచి వెళ్లేరు. పరీక్షల ముందు వాళ్ళను వూర్లంట త్రిప్పటం వల్ల వాళ్ళ చదువుకు అంతరాయం కల్గుతుందనే భయం.

నందివాడ గ్రామం రోడ్డు పాయింట్‌లో బస్సు దిగి పొలాలగట్లంట నడచి వెళ్తే మూడు మైళ్ళ దూరంలో వుంది. లేదా నాటుబండి మీద గోర్జగుండా వెళ్తే ఐదు మైళ్ల దూరం. వాళ్లకోసం బండి పంపేడు రామశర్మ. వారు ఇంటికి చేరుకునే సరికి ఉదయం పదిగంటలైంది. వాళ్లు వెళ్ళేసరికి కాంతమ్మగారి ఆరోగ్యం కాస్త మెరుగ్గా వుంది.

'రెండు రోజులు అమ్మకు వొంటిమీద తెలివి లేదక్కా నేను భయపడి మీకు కబురుపంపేను. ఈ రోజు ఉదయం నుంచీ కొంచెం నయంగా వుంది. పిలిస్తే పలుకుతోంది' ' అన్నాడు రామశర్మ.

అనంతలక్ష్మి తల్లిమంచం దగ్గరకు వెళ్లి "అమ్మా! అమ్మా!" అని పిల్చింది జీరపోయిన గొంతుకతో. కాంతమ్మగారు కూతురు గొంతుక విని మెల్లగా కళ్లు తెరచి కూతురు, అల్లుడ్ని చూసి సంతోషించి "పిల్లలేరీ?" అని అడిగేరు.

"పరీక్షలు దగ్గరపడ్డాయిగా, చదువుకుంటున్నారు. శలవులకు వస్తారు" అంది అనంతలక్ష్మి.

కాంతమ్మగారు చిరునవ్వు నవ్వి "ఎండన పడి వచ్చేరు, వాళ్ళకి కాఫీ అవీ ఇచ్చేవా?" అని కోడలిని అడిగి మళ్లీ మగతగా కళ్లు మూసుకొని పడుకున్నారు.

ఆరోజు సాయంత్రానికి కాంతమ్మగారి ఆరోగ్యం పూర్తిగా కుదుట పడింది. కాస్త లేచి కూర్చోగల్గుతున్నారు.

* * *

ఆదివారం ఉదయాన్నే వామనరావు అనంతలక్ష్మి ప్రయాణమవుతూంటే వారిని సాయంత్రం బస్సుకి వెళ్లమని ఇంటిల్లిపాదీ బలవంతం చెయ్యడంతో మరి వారి మాట కాదనలేకపోయేరు.

సాయంత్రం వారు రోడ్డు చేరుకొనేసరికి ఆఖరి బస్సు పావుగంట క్రితమే వెళ్లిపోయినట్లు తెల్సి వామనరావు ఎంతో బాధపడ్డాడు. "మార్నాడే రవి ఎగ్జామినేషన్ ఫీజు కట్టడానికి లాస్ట్‌డేటు. డబ్బు తెచ్చి బీర్వాలో వుంచేడు కాని దాని తాళం చెవి తన దగ్గరే వుండిపోయింది. "అనుకోకుండా ఇక్కడ చిక్కడిపోయేను. ఇంటి దగ్గర వాళ్లెంత ఆందోళన చెందుతున్నారో?' అనుకున్నాడు.

అనంతలక్ష్మికూడ మనస్సులో ఎంతో నొచ్చుకుంది. దీనికంతకూ తనే కారణమనుకుంది. "ఉదయం అమ్మ, తమ్ముడు, మరదలూ వారిని ఆపూట వుండి సాయంత్రం బస్సులో వెళ్లమని బలవంతం చేస్తే తనే మెత్తబడి భర్తను బలవంతంగా వొప్పించింది వుండ టానికి"

అక్కడ నాగర్నతం వంటపని తొందరగా ముగించుకొని టైమ్ చూసింది. తొమ్మిదిన్నర. తండ్రి ఇంత వరకూ రాలేదు. ఏం చెయ్యాలో తోచటం లేదు. తమ్ముడికి పరీక్ష ఫీజు కడతానని భరోసా యిచ్చింది. కాని ఎలా కట్టాలి? డబ్బులేవీ? వూరుకి బయల్దేరుతూ తండ్రి తన చేతిలో వుంచిన ఐదురూపాయలు మించి ఒక్క పైసా ఎక్కువ లేదు. విచారవదనంతో గదిలో ఒక మూల పుస్తకం చేత్తోపట్టుకొని కూర్చుని దిక్కులు చూస్తున్న తమ్ముడిని చూసి

నాగరత్నానికి ఎంతో జాలి వేసింది.

"ఆరోజు ఫీజు కట్టకుంటే వాడి భవిష్యత్తు నాశనమవుతుంది ఎలా?"

ఎవరినైనా అప్పుఅడుగుదామంటే వాళ్లేమనుకుంటారోనన్న భయం. తల్లిదండ్రులు వారినెంతో క్రమశిక్షణతో పెంచుతున్నారు. ఏ విషయంలోనూ ఎవరి ముందూ చేయిజాచకూడదనే సిద్ధాంతం వామనరావుది. వారు ఎవరివద్దా ఎప్పుడూ అప్పు తీసుకోలేదు. వున్న దాంతోనే సంసారం గుట్టుగా నెట్టుకొస్తున్నారు.

నిముషాలు దొర్లుతున్న కొలదీ నగారత్నానికి కాళ్లల్లో వొణుకు ప్రారంభమైంది. నాగరత్నానికి సడన్‌గా ప్రక్క వీధిలో వున్న వాళ్ల పెదనాన్న పద్మనాభం గారు గుర్తుకొచ్చేరు. వెంటనే ఇంటికి తాళం పెట్టి తమ్ముడిని తీసుకొని వాళ్లింటికి బయల్దేరింది.

వామనరావుగారి సొంత అన్న పద్మనాభంగారు అయితే అతనికి భార్య పద్మావతి తరుపునుంచీ లక్షల ఆస్తి సంక్రమించడంతో అతను భార్యావిధేయుడయ్యేడు. పద్మావతి తన భర్తవైపు బంధువులు ఎవరూ తన యింటికి రాకపోకలు చేయకుండా ఎంతో కట్టుదిట్టం చేసి తన స్టేటస్ నిలుపుకుంటోంది.

ఎంతో జంకుతో గుమ్మంలో అడుగుపెట్టేసరికి పెదనాన్న చిరునవ్వుతో ఎదురురావడంతో కొండంత ధైర్యం వచ్చింది నాగరత్నానికి.

"రండి! ఏమిటిలా ఉదయాన్నే వచ్చేరు? నాన్నా అమ్మా బాగున్నారా? రవీ నీ పరీక్షలు దగ్గరవుతున్నాయి. బాగా చదువుతున్నావా? అక్కలాగే నువ్వూ స్కూలు ఫస్ట్ రావాలి!" అన్నారు ఆప్యాయంగా.

"పెదనాన్న! మా అమ్మమ్మకి బాగులేదని అమ్మా నాన్నా శనివారం ఉదయం నందివాడ వెళ్లేరు. నిన్న ఉదయానికే వస్తామన్నారు. ఏకారణంచేతో ఇప్పటి వరకూ రాలేదు. ఈ రోజు తమ్ముడి పరీక్ష ఫీజు కట్టడానికి ఆఖరి రోజు. ఏం చెయ్యాలో తోచటం లేదు. అందుకని మీ దగ్గరకొచ్చేం..."

"అలాగా! వాడెప్పుడూ అంతేనమ్మా! ఏ పనీ చురుగ్గా చెయ్యడు. పరీక్ష ఫీజు నాలుగు రోజులు ముందరే కట్టవచ్చు కదా? మీరేం బెంగపడకండి..."

"ఏవండోయ్! ఓ మారిలా వస్తారా!" గదిలోంచి భార్య పిలుపువిని లోనికి వెళ్లేరు పద్మనాభంగారు.

"చూడండీ! మీ తమ్ముడిగారి పిల్లల మీద మీరింతవరకూ వొలకబోసిన ప్రేమ చాలుగాని ఇక్కడ అడ్డమైన వాళ్లకూ దాన ధర్మాలు చెయ్యడానికి మూటలేం లేవు. పిల్లల్ని

ఇలా పరాయి కొంపలకు తోలడానికి కన్నవాళ్లకి సిగ్గుండాలి" అంటూ భర్తను మందలించింది పద్మావతి.

దొడ్డమ్మ మాటలు విన్న నాగరత్నం తమ్ముడి భుజం మీద చేయివేసి వీధిలోకి నడిచింది.

తండ్రికి ప్రాణ స్నేహితుడైన పాపారావుగారింటికి వెళ్లి అడిగింది. ఆయన కొంతతడవు యోచించి "అయినా వూర్లో మీ పెదనాన్న వున్నాడుగదా! ఆయన్ని అడగండి" అని ఉచిత సలహాపారేసాడు.

తండ్రికి మరొక స్నేహితుడు మాధవరావుని అడిగింది.

"నాకూ డబ్బు కావాలి. బేంకికి వెళ్తున్నాను. సాయంత్రం మీ నాన్నను మా ఇంటికి పంపు. యిస్తాను" అన్నాడు.

ఎదురింట్లోవున్న ఇంజనీరుగారి భార్యను అడిగింది.

"ఎన్నడూ అప్పు అడగని వాళ్లు ఈ రోజు అప్పుకని వస్తే పిల్లలు ఏదో దూబరా ఖర్చుల కోసం వచ్చి వుంటారనుకొని "మీ బాబయ్యగారు వారం రోజులుగా కేంపులో వున్నారు. ఇంటి ఖర్చుల కిచ్చినదంతా ఖర్చయిపోయిందమ్మా" అన్నారు.

ఇప్పుడు ఇంకెవర్ని అడగాలో అర్థంకాక తమ్ముడితో యింటికి వచ్చింది.

"అక్కా! మరెవర్నీ అప్పు అడగొద్దు. వాళ్లు లేదంటే ఎంతో సిగ్గుగావుంది" అన్నాడు రవి.

"అవున్రా! అడగాలంటే నాకూ సి...గ్గు" అనబోయేంతలో మెరుపులాంటి ఆలోచన వచ్చింది. వెంటనే గదిలోకి వెళ్లి తన పెట్టెలో అడుగునున్న వస్తువు వెతికి తీసి పర్సులో వేసుకుంది.

"రవీ! నువ్వు వెళ్లి మీ స్కూలు దగ్గర వుండు. నేను అరగంటలో డబ్బు తీసుకొని వస్తాను. ఫీజు కట్టేద్దాం" అని బజారుకు వెళ్లింది.

* * *

ఉదయం చీకటితోనే లేచి ఫస్ట్ బస్సులో బయల్దేరేరు వామనరావు. అనంతక్ష్మి. అయితే దారికడ్డంగా రోడ్డు మీద పెద్ద చెట్టొకటి పడిపోవడంతో సుమారు నాలుగు గంటలపాటు రాకపోకలకు అంతరాయం కల్గింది. వారు ఇల్లు చేరుకునే సరికి మధ్నాహ్నం రెండు గంటలైంది. ఎంతో ఆందోళనతో గుమ్మంలో అడుగుపెట్టేసరికి ఆనందవదనంతో ఎదురువచ్చిన కొడుకుని చూడగానే మనస్సు కాస్త కుదుటపడింది వామనరావుకి "పరీక్ష ఫీజు కట్టేసేను! అక్క కట్టింది నాన్నగారు" అన్నాడు సంతోషంతో రవి.

కొడుకు నోటి వెంట వెలువడిన మాటలకు అలనాడు వాయుపుత్రుడు సీతావియోగంతో

వున్న శ్రీరాముని ఎదుటపడి చూసేను సీతమ్మ తల్లిని అన్న చల్లని కబురు చెప్పినప్పుడు ఆ శ్రీరాముడు ఎంత ఆనందించేడో అంతకు వేయిరెట్లు ఆనందం పొందేడు నేడు వామనరావు.

"అంత డబ్బెక్కడిదమ్మా." అన్నాడు ఆశ్చర్యంతో కూతురువంక చూసి.

"క్షమించండి నాన్నగారూ! మీరు నిన్నటికే వస్తానన్నారు. ఈ రోజు ఉదయం కూడా ఎంతకూ రాలేదు. కారణం కూడా తెలియదు. వస్తారో రారో నన్న భయం. ఫీజు కట్టడానికి టైం మించిపోతుంటేనూ అప్పుకోసం ఎందరినో అడిగేను. ఎవ్వరూ ఇవ్వలేదు. అందుకని పెట్లో వున్న నా చిన్ననాటి 'సిగ్గుబిళ్ల' అమ్మి తమ్ముడి ఫీజు కట్టేను" అంది నాగర్నతం భయంతో తల్లిచాటున దాగుంటూ.

వామనరావు కళ్లు ఆనందభాష్పాలతో నిండేయి కూతరు మాటలకు.

(ఆంధ్రభూమి సచిత్రవారపత్రిక, 3-4-1997) ✪